17332 వద్ద నిరోధం!



సెన్సెక్స్ విశ్లేషణ

జనవరి 27తో ముగిసిన వారానికి

సమీక్ష : రిజర్వు బ్యాంకు సీఆర్ఆర్‌లో కోత విధించడం; ఎఫ్ఐఐల కొనుగోళ్లు కొనసాగించడంతో ప్రధాన షేర్లు పరుగులు తీశాయి. దీంతో గత వారం మార్కెట్ లాభాలతో ముగిసింది.

అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల కారణంగా మార్కెట్ ప్రారంభంలో స్తబ్దంగా కనిపించింది. అయితే రిజర్వు బ్యాంకు నగదు నిల్వల నిష్పత్తి(సీఆర్ఆర్)ని అర శాతం తగ్గించి 5.5 శాతానికి పరిమితం చేయడంతో ర్యాలీ కనిపించింది. వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే రంగాలు లాభాల బాటలో నడిచాయి. మెరుగైన త్రైమాసిక ఫలితాలు కూడా సెన్సెక్స్ రాణింపునకు కారణమయ్యాయి. మరో వైపు ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూలంలోనే కొనసాగి సెంటిమెంటును మెరుగుపరిచింది. గ్రీసు నుంచి మిశ్రమ సంకేతాలు, దేశీయంగా లాభాల స్వీకరణ కనిపించడంతో లాభాలు కాస్త తగ్గాయి. అయినా కూడా వారం మొత్తం మీద సెన్సెక్స్ 495 పాయింట్ల లాభాన్ని పొందగలిగింది. 17234 వద్ద స్థిరపడింది.

ఎఫ్ఐఐల తీరు : రూపాయి బలపడుతుండడంతో ఎఫ్ఐఐలు గత వారం రూ.3066 కోట్ల నికర కొనుగోళ్లు చేశారు. మరో పక్క దేశీయ మ్యూచువల్ ఫండ్లు రూ.601 కోట్ల నికర అమ్మకాలు చేయడం గమనార్హం.

రంగాల వారీగా : ఆర్‌బీఐ సీఆర్ఆర్‌లో కోత వేసిన నేపథ్యంలో యంత్ర పరికరాలు, వాహన రంగ సూచీలు రాణించాయి. టెలికాం, మన్నికైన వినిమయ వస్తువుల రంగాలు కూడా ర్యాలీలో పాలుపంచుకున్నాయి. లాభాల స్వీకరణకు తోడు మిశ్రమ ఆర్థిక ఫలితాలతో బ్యాంకింగ్ సూచీలో లాభాలు పరిమితంగా కనిపించాయి. స్థిరాస్తి, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ సూచీల్లో విక్రయాల ఒత్తిడి కనిపించింది.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం..

మార్కెట్లో సానుకూలతను సూచిస్తోంది.

భవిష్యత్ అంచనా : మార్కెట్‌కు తక్షణ నిరోధ స్థాయి 200 రోజుల చలన సగటు వద్ద ఉంది. కాబట్టి 17332 పైన నిర్ణయాత్మకంగా ముగిస్తే తప్ప లాభాల స్వీకరణకు ముందు ర్యాలీని ఊహించలేం. 16659 కంటే దిగువకు వస్తే మాత్రం దిద్దుబాటుకు అవకాశం ఉంది.

ప్రభావిత అంశాలు : ఐరోపా మార్కెట్లను మన మార్కెట్లు సునిశితంగా గమనించడం కొనసాగించవచ్చు. అమెరికా జీడీపీ గణాంకాలు నిరుత్సాహకరంగా వెలువడడం స్థానిక మార్కెట్లపై ప్రభావం చూపవచ్చు. ఈ వారం వెలువడనున్న వాహన, సిమెంటు, టెలికాం రంగాల గణాంకాలతో పాటు త్రైమాసిక ఫలితాలు కూడా ఎంపిక చేసిన షేర్లలో కదలికలను ప్రభావితం చేయొచ్చు. రూపాయి మరింత బలపడితే మార్కెట్ రికవరీకి మద్దతు లభిస్తుంది. ప్రతికూల ఆహార ద్రవ్యోల్బణం; సీఆర్ఆర్‌లో కోత నేపథ్యంలో వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే రంగాలు వచ్చే కొద్ది వారాలు బలంగానే కనిపించవచ్చు. ఎఫ్ఐఐల పెట్టుబడులు, అంతర్జాతీయంగా నిరుద్యోగ, వ్యక్తిగత ఆదాయ గణాంకాలతో పాటు ఇతర పరిణామాలను కూడా మార్కెట్ గమనించవచ్చు.

తక్షణ నిరోధ స్థాయిలు: 17488, 17655, 17908; తక్షణ మద్దతు స్థాయిలు: 16990, 16659, 16518

17332 స్థాయిల వద్ద మార్కెట్‌కు బలమైన నిరోధం ఎదురవుతుందని అంచనా.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ